**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 31.01.2026** **సమయం: 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు సంపూర్ణంగా న్యాయం చేసి, విరివిగా నిధులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్నప్తి చేశారు.
2. గత రెండేళ్లలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యాన్ని కల్పించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.
3. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళను అందించటమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.
4. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రేపు సిట్ విచారణకు హాజరు కానున్నారు.

..................................................

**బడ్జెట్ – పొన్నం ప్రభాకర్**

రేపటి కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు సంపూర్ణ న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణకు నిధులను కేటాయించాలన్నారు. బడ్జెట్ లో తమ ప్రతిపాదనలను కేంద్రం పూర్తిగా ఆమోదించాలని, అలాగే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి సహకరించాలని విజ్నప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణ వైఖరి కాకుండా సయోధ్య ను ఆకాంక్షిస్తుందని ఆయన అన్నారు. బడ్జెట్

లో తెలంగాణకు నిధులు కేటాయించేలా రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపిలు కృషి చేయాలని ఆయన సూచించారు.

........డెస్క్

**దామోదర**

గత రెండేళ్లలో రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యాన్ని కల్పించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయి వరకు ప్రచారం చేయాలని మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఆయన అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులతో గాంధీ భవన్ లో ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాజనర్సింహతో పాటు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి అజహారుద్దీన్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

..........SANGAREDDY. PTC

**మున్సిపల్ ఎన్నికలు**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలతో అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూమ్ ద్వారా మీటింగ్ నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ గడువు ముగియడంతో,ప్రతి వార్డులో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వహించవద్దని, రెబల్స్ ఉన్నచోట చర్చల ద్వారా సమన్వయం చేసుకోవాలని ఆయన అన్నారు. మంత్రులు, నియోజకవర్గ ఇంఛార్జులు సమిష్టిగా పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. ఫిబ్రవరి 4 నుంచి 8 వరకు రేవంత్ రెడ్డి పలు మున్సిపాలిటీల్లో పర్యటించనున్నారు.

........డెస్క్

**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళను అందించటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం లభించటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ లో ఇందుకు సంబంధించి నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా చట్టం ముందు అందరూ సమానులే అని తప్పు చేసినవారు శిక్ష ఎదుర్కొనాల్సిందేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దోషులు ఎంతటి వారు అయిన శిక్ష నుంచి తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు.

..........PTC, khammam

**జిహెచ్ ఎం సి బడ్జెట్**

జిహెచ్ ఎం సి పాలక మండలి సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి 11 వేల 460 కోట్ల రూపాయల ప్రతిపాదనలతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. జిహెచ్ ఎం సి కి గత ఏడాది వివిధ మార్గాల ద్వారా వచ్చిన ఆదాయం 6 వేల 441 కోట్ల రూపాయలు కాగా ఖర్చు 4 వేల 57 కోట్ల రూపాయలుగా ఉంది. కొత్తగా విలీనమైన మున్సిపాలిటీలకు 2 వేల 260 కోట్ల రూపాయలు కేటాయించారు.

.........డెస్క్

**సమ్మె**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు కొత్త కార్మిక కోడ్ లను నిరసిస్తూ పలు కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె కు పిలుపునిచ్చాయి. కొత్త చట్టాలు కార్మిక హక్కులకు వ్యతిరేకంగాను, యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపించాయి. కాగా ఈ సమ్మెకు వివిధ బ్యాంకు సంఘాలు తమ మద్ధతును ప్రకటించాయి.

........డెస్క్

**సాగు విస్తీర్ణం**

రాష్ట్రంలో సాగు విస్తీర్ణాన్ని పారదర్శకంగా అంచనా వేయటానికి శాటిలైట్ ఆధారిత నివేదికను రూపొందించామని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య అన్నారు. ఈ రోజు హైదరాబాద్, సైఫాబాద్ లోని కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని సుమారు 10 వేల రెవెన్యూ గ్రామాల్లో శాటిలైట్ పరిజ్ఞానంతో పంటల గణన పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. స్విట్జర్లాండ్‌కు చెందిన SARMAP సంస్థ సహకారంతో, సర్వే నంబర్ల వారీగా నిర్వహించిన ఈ లెక్కింపు 90 శాతం ఖచ్చితత్వంతో కూడి ఉందని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 6వ తేదీన ఈ సమగ్ర నివేదికను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అధికారికంగా అందజేయనున్నట్లు వీసీ తెలిపారు. డిజిటల్ వ్యవసాయం ద్వారా రైతులకు మేలు చేయడమే వర్సిటీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

.........పిటిసి

**బడ్జెట్ అంచనా**

మనదేశం ప్రబలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న నేపథ్యంలో 2026-27 కేంద్ర బడ్జెట్ కు ఎంతో ప్రాధాన్యం ఉందని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి ఎస్ ఎస్ రాంబాబు అన్నారు.ఈ బడ్జెట్  లో మౌలిక వసతులు, తయారీ రంగం, ఎంఎస్ఎమ్ఇ సెక్టార్ కు తగిన ప్రాధాన్యం కల్పించాలని  ఆయన సూచించారు. బడ్జెట్ అంచనాలపై ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ....

**ఎస్ ఎస్ రాంబాబు - బైట్...........**

**2026-27 కేంద్ర బడ్జెట్ అంచనాలు, ప్రాధాన్యాల పై ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఈ రోజు రాత్రి 8 గంటలకు ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని ప్రసారం చేస్తుంది.**

**అక్షరమాల**

ప్రభుత్వం చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా వయోజన విద్య అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ అన్నారు.. చదువుకోవడానికి వయసుతో సంబంధం లేదని, 15 నుండి 60 సంవత్సరాల లోపు వారందరూ చదువుకోవాలని, అప్పుడే సమాజంలో గౌరవ స్థానం లభిస్తుందని అన్నారు.మంచిర్యాల జిల్లా, హాజీపూర్ మండలం, రాపల్లి గ్రామంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి తో కలిసి ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు.

..........పీటీసీ మంచిర్యాల జిల్లా..

**రోడ్డు భద్రత**

రోడ్డు భద్రత నియమాలను క్రమం తప్పకుండా పాటించటం ద్వారా సురక్షిత ప్రయాణాలు చేయవచ్చని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఈరోజు కలెక్టరేట్ లో రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రత అవగాహన క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ క్విజ్ లో పాల్గొన్న విద్యార్థులకు బైక్ హెల్మెట్స్ పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

.........పీటీసీ, జనగామ జిల్లా

**కెటిఆర్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు రేపు సిట్ విచారణకు హాజరు కానున్నారు. హైదరాబాద్, నంది నగర్ ఆయన నివాసంలో విచారణ నిర్వహిస్తామని సిట్ స్పష్టం చేసింది. సిట్, ప్రభుత్వ వైఖరికి నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత

నిరసనలు చేపడుతామని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పై కక్ష సాధింపులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తోందని ఆయన అసహనం వ్యక్తం చేశారు.

......డెస్క్

**ధర్నాల నిషేదం**

పోలీస్ అధికారుల అనుమతి లేకుండా రానున్న నెల రోజుల పాటు కామారెడ్డి జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని... ప్రజా ధనానికి నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఇతరత్రా వివిధ సంఘాల నాయకులు... పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా పైన తెలిపిన చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 4 మున్సిపాలిటీలకు సంబంధించిన ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, ఇతర వ్యక్తులను, రాజకీయ పార్టీలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం, సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టినా, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

.........PTC - కామారెడ్డి

**ఓటర్ జాబితా**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా 2025 ఓటర్ జాబితాను 2002 ఎస్.ఐ.ఆర్ తో మ్యాపింగ్ చేసే ప్రక్రియ నిర్వహణను వేగవంతం చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఈ రోజు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో సమావేశం నిర్వహించారు.ప్రతి బిఎల్ఓ తో రోజుకి 30 ఎంట్రీలు లక్ష్యాన్ని నిర్దేశించి మ్యాపింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.వనపర్తి జిల్లా లో మొత్తంగా ఇప్పటివరకు 63.22 శాతం పూర్తి చేశారని, ప్రక్రియను మరింత వేగవంతం చేసి లక్ష్యాలను సాధించాలన్నారు.

....పీటిసి, వనపర్తి జిల్లా